క్లుప్తంగా

ఎన్నికలకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు
– ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో సహకరించిన ప్రతిఒక్క కార్యకర్త, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఏలూరు రోడ్డు పార్టీ కార్యాలయం వద్ద నాలుగు మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. పోలింగ్ జరిగిన తీరుపై చర్చించారు. పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారులు వినయ్, శ్యామ్, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ సేవా కార్యక్రమాలలో భాగంగా మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు పీవీ శేషగిరిరావు వితరణతో పంపిణీ చేసినట్లు గుడివాడ శాఖ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ట్రెజరర్ గోపిరెడ్డి, డైరెక్టర్ దండమూడి సీతారామస్వామి, టి.రామ్మోహనరావు, జి.రామకృష్ణ, జి.చంద్రశేఖరరావు, టి.ఉమాదేవి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో లలితా పారాయణం

మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీబొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న అయ్యప్ప ఆలయం 33వ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా మంగళవారం స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు 100 మందికి పైగా సుహాసినిలు శ్రీ లలితా పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీ లలితా హోమం, శ్రీ లక్ష్మీ గణపతిహోమం, లక్ష మల్లెలతో స్వామివారికి పూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం దాదాపు 1000 మంది సుహాసినిలతో సామూహిక కుంకుమార్చన జరగనుంది. పూజలో పాల్గొనే సుహాసినీలకు పసుపు, కుంకుమగా చీరలు ప్రసాదంగా అందజేస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

18న వాసవీకన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

నాగాయలంక: స్థానిక పార్వతీసమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18న కన్యకా పరమేశ్వరీదేవి 4641వ జన్మదినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు మంగళవారం తెలిపారు. వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకుని గణపతి సచ్చిదానంద స్వామీజీ, కె.భానుప్రసాద్ దివ్యమంగళ ఆశీస్సులతో ఉదయం 9గంటలకు 108లీటర్ల ఆవుపాలతో కన్యకాంబకు పంచామృత అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. సహస్ర నామ కుంకుమార్చన, సామూహిక వాసవీమాత నామ పారాయణం చేస్తారని తెలిపారు. శ్రీవాసవీ సేవాదళ్ నిర్వహణలో సాయంత్రం 5గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పురవీధుల్లో పల్లకీలో కృష్ణానది వరకు ఊరేగింపు, సాయంత్రం 7గంటలకు పవిత్ర కృష్ణానదిలో అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పోలింగ్ శాతంలో పామర్రుకు రెండో స్థానం

పామర్రు: కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెడనలో 88.57 శాతం ఓట్లు పోల్ అయి ప్రథమ స్థానంలో ఉండగా, పామర్రు 88.11 శాతంతో ద్వితీయ స్థానంలో ఉంది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,84,632 మంది. వీరిలో పురుషులు 89,422 మంది, మహిళలు 95,207, ఇతరులు ముగ్గురు ఉన్నారు. వీరిలో ఓట్లు వేసిన వారు పురుషులు 79,413 మంది, మహిళలు 83,270 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1,62,683 ఓట్లు పోలై 88.11 శాతంగా నమోదైంది. నియోజకవర్గంలోని మహిళలే ఎక్కువశాతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సంక్షేమ పథకాల అమలుతో ఉత్సాహం

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలకు అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులై ఉత్సాహంతో ఓటు వేశారనే చర్చ సాగుతోంది. 2019లో కన్నా 2024లో ఓటింగ్ శాతం బాగా పెరిగింది. దీనికి కారణం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆసక్తి పెరిగి ఎక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొని ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలని ఓటు వేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం ఆశించిన రీతిలో అన్ని వర్గాలకు న్యాయం చేసినట్లు సామాన్యుడు గ్రహించాడు. జగనన్న ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టాలనే ఉద్దేశంతో తన ఓటు హక్కును ఆయుధంగా వినియోగించుకున్నట్లు సమాచారం.



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు

పంచాయతీలకు మహర్దశ

జగనన్న ప్రభుత్వంలో పంచాయతీలకు మహర్దశ ఏర్పడింది. ప్రతి పంచాయతీకి సుమారు రూ.కోటితో ప్రభుత్వ లబ్ధి చేకూరటంతో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో వీటిని నిర్వీర్యం చేసేవిధంగా జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేయటం, నీరు–చెట్టుపథకం, ఇసుక, మద్యం తదితరాలను అడ్డం పెట్టుకుని ద్వితీయ శ్రేణి నాయకులు రూ.కోట్లకు పడగలెత్తడంతో గ్రామాల్లోని సామాన్య ప్రజలు జీర్ణించుకోలేకే ఇప్పటికీ గుర్తు పెట్టుకుని చంద్రబాబుకు వ్యతిరేకంగా ఓటు వేశారని రాజకీ విశ్లేషకులు చెబుతున్నారు. అంతే కాకుండా చంద్రబాబును అన్ని వర్గాల ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, దీంతో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అనుసరించారనే చర్చ సాగుతోంది.

అందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు



పామర్రు: తన కోసం రాత్రి, పగలనక అహర్నిశలు కష్టపడిన పామర్రు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులకు హృదయ పూర్వక ధన్యవాదాలను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని సర్వేలు తమకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఎన్నికల ఫలితాల్లో తాము గెలుస్తున్నామన్నారు. గెలిచిన మరుక్షణం నుంచి అందరికీ అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు.

మండవల్లిలో పోలైన ఓట్లు 34,451

మండవల్లి: మండవల్లి మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 39,212 మంది ఓటర్లు ఉండగా, 34,451 ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ జెస్సబాని మంగళవారం తెలిపారు. పోలైన ఓటర్లలో పురుషులు 17,174, మహిళలు 17,277 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

కైకలూరులో మహిళా ఓటర్లదే పైచేయి

- నియోజకవర్గంలో 87.32 శాతం పోలింగ్
- అర్ధరాత్రి వరకు కొనసాగిన పోలింగ్ ప్రక్రియ
- మహిళా చైతన్యం వైఎస్సార్ సీపీకే అనుకూలం



కలిదిండి మండలం మూలలంకలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

కై కలూరు: కై కలూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్ల చైతన్యం వెల్లివిరిసింది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో నియోజకవర్గంలో మొత్తం 2,05,604 మంది ఓటర్లకు 1,79,536 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుష ఓటర్లు 89,384 ఉండగా మహిళా ఓటర్లు 90,151 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళలు 767 మంది ఎక్కువగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 2019లో ఏప్రిల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 1,95,782 మంది ఓటర్లకు పురుషులు 87,005, మహిళలు 85,380 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో మహిళా ఓటర్లు కంటే పురుష ఓటర్లు 1,625 మంది ఎక్కువగా ఓట్లు వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మహిళా ఓటర్ల శాతం పెరగడానికి ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అర్ధరాత్రి కూడా బారులు తీరిన ఓటర్లు

నియోజకవర్గ ఓటర్లలో ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉత్సాహం కనిపించింది. ఇందుకు తార్కాణమే సోమవారం అర్ధరాత్రి వరకు కొనసాగిన పోలింగ్ ప్రక్రియగా చెప్పవచ్చు. నియోజకవర్గంలో 235 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. అనేక బూత్‌లలో సాయంత్రం ఆరు గంటల వరకు 'క్యూ'లో నిలుచున్న ఓటర్లకు చీటీలు ఇచ్చి ఓటు హక్కు కల్పించారు. రాత్రి 11 గంటల వరకు కొన్ని బూత్‌లలో పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గంలో ఉదయం నుంచి ఎన్నికల సరళిని గమనిస్తే ఉదయం 9 గంటలకు 18,713 (9.10 శాతం), 11 గంటలకు 49,608 (24.13 శాతం), మధ్యాహ్నం ఒంటి గంటకు 81,597 (39.69 శాతం), మధ్యాహ్నం మూడు గంటలకు 1,26,918 (61.73 శాతం), సాయంత్రం 5 గంటలకు 1,51,699 (73.78 శాతం), రాత్రి 11 గంటలకు 1,79,536 మంది (87.32 శాతం) ఓటు వేశారు.

వైఎస్సార్ సీపీ నాయకుల్లో జోష్

ఎన్నికల పోలింగ్‌లో మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును అధికంగా వినియోగించుకోవడం, గ్రామాల్లో కనిపిస్తున్న ఓటింగ్ సరళిని గమనించిన వైఎస్సార్ సీపీ నాయకుల్లో మళ్లీ పార్టీ మరో పర్యాయం విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఆయన కుమారులు వినయ్, శ్యామ్‌ను కలిసి అన్ని మండలాల్లో జరిగిన పోలింగ్ తమ పార్టీకి అనుకూలంగా జరిగిందని చెప్పారు.

వైఎస్సార్ సీపీదే విజయం

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సీపీ, గుడివాడలో కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) గెలుపు తథ్యమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అధిక సంఖ్యలో విజయం సాధించనున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడం, కొడాలి నాని ఐదోసారి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమన్నారు. దేవుని దయ, ప్రజల దీవెన తమ గెలుపునకు కారణమన్నారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఓటు హక్కును వినియోగించుకోవడం గొప్ప విశేషమన్నారు. గుడివాడలో 80 శాతం పైబడి ఓట్లు పోల్ కావడం కూడా ఓ చరిత్ర అని ఇది కొడాలి నాని విజయానికి దోహదపడతాయన్నారు. ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ, వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కొడాలి నాని తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, నాయకులు వెంపటి సైమన్, టీవీ రమణకుమార్, చుండూరి శేఖర్, తంగిరాల మోహన్‌దాస్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రేపు మండల పరిషత్ సమావేశం

పామర్రు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు మండల పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భారతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ సమావేశం మండల పరిషత్ అధ్యక్షుడు డి.అశోక్‌కుమార్ అధ్యక్షతన జరగనుందని పేర్కొన్నారు. సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

అత్యధిక పోలింగ్ పెనుమల్లి.. అత్యల్పం కైకలూరు

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో కైకలూరు నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ ముదినేపల్లి మండలం పెనుమిల్లిలో నమోదైంది. ఇక్కడ బూత్ నంబరు– 69లో మొత్తం ఓటర్లు 965 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 483, మహిళలు 482 ఉన్నారు. వీరిలో పురుషులు 462, మహిళలు 463 కలిపి మొత్తం 925 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ బూత్‌లో 95.85 పోలింగ్ శాతం నమోదైంది. కైకలూరు – 116 బూత్ ఎంపీపీ స్కూల్లో అత్యల్పంగా ఓటింగ్ నమోదైంది. ఈ బూత్‌లో 814 మంది ఓటర్లు ఉండగా వీరిలో 417 మంది పురుష ఓటర్లు, 397 మంది మహిళలు ఉన్నారు. పోలింగ్ రోజున 295 మంది పురుషులు, 275 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 570 మంది మాత్రమే ఓట్లు వేశారు. ఇక్కడ 70.02 శాతంతో నియోజకవర్గంలో అత్యల్పంగా పోలింగ్ నమోదైంది.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన శివవర్మ

సంగమేశ్వరం(నాగాయలంక): గ్రామ కమిటీ, గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో మండల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్‌ను అగ్నికుల క్షత్రియ మండల నేత, వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు కొక్కిలిగడ్డ శివవర్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో మొదటి స్థానంలో గెలుపొందిన జట్టుకు రూ.25 వేల నగదు బహుమతిని శివవర్మ స్పాన్సర్ చేస్తున్నట్లు ప్రకటించారు. సర్పంచ్ నాయుడు నాగమల్లీశ్వరి వితరణతో రెండవ బహుమతి కింద రూ.15వేలు, నాయుడు వెంకటేశ్వరరావు తృతీయ బహుమతి కింద రూ.7వేలు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద కేఎస్ఎస్ సీ ఫుడ్స్ వారు మూడు వేలు నగదు బహుమతులను ప్రకటించారు. మ్యాచ్‌లు వారం రోజు పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. పెద్దలు, గ్రామస్తులు, పలు జట్లు సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.